## క్లుప్తంగా

### క్రికెట్ విజేత దినేష్ జట్టు



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నాయకులు

**పుత్తూరు:** వడమాలపేట మండలం ఎస్బీఆర్ పురంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన వైఎస్సార్‌సీపీ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ మంగళవారం జరిగింది. ఏడు జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్ ఫైనల్స్‌లో జీవన్ జట్టుపై దినేష్ జట్టు విజయం సాధించింది. విన్నర్స్ జట్టుకు షీల్డ్‌తో పాటు రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు. రన్నర్స్ జట్టుకు రూ.3 నగదు బహుమతిని అందజేశారు. వడమాలపేట యువత నాయకుడు చైతన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరామరాజు, సచివాలయ కన్వీనర్ బాబు, టోర్నమెంట్ ఇన్‌చార్జి మణి తదితరులు పాల్గొన్నారు.

### వాటర్‌కూలర్, ప్యూరిఫైర్ వితరణ



**నగరి :** పట్టణ పరిధిలోని కరకంతేశ్వర ఆలయానికి దాత మదన్‌కుమార్ వాటర్ కూలర్, మరో దాత వాసు వాటర్ ప్యూరిఫైర్‌ను వితరణగా అందించారు. మంగళవారం వీటిని ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యంకు అందజేయగా వాటిని ఆలయంలో అమర్చారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు పరిశుద్ధ నీటిని అందించాలన్న ఉద్దేశంతో వీటిని అందించినట్లు దాతలు తెలిపారు.

### కొండచుట్టు భూమి ఆక్రమణపై ఫిర్యాదు

**నింద్ర :** మండలంలోని కర్పరవేడు గ్రామ కొండచుట్టు నిర్వహించే భూమిని ఆక్రమించిన వారిపై వారిపై చర్యలు తీసుకోవాలని కేర్‌పాకెం, కర్పరవేడు, ఊరూరు, ఆలపాకం, నెట్టేరి గ్రామస్తులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఆలపాకం లెక్క దాఖలా లోని సర్వే నం.5.7లో 0.67లో సెంట్ల భూమి ఉందన్నారు. ఇది కొండచుట్టుకు చెందిన స్థలమని తెలిపారు. ఈ భూమిని ఆలపాకం దళితవాడకు చెందిన పళణి ఆక్రమించుకున్నాడని తెలిపారు. బుధవారం నాటి కనుమపండుగ కొండచుట్టు నిర్వహణకు ఇబ్బందిగా మారిందన్నారు. రెవెన్యూ అధికారులతో కలసి భూమిని సర్వే చేసి స్వాధీనం చేసుకుని, కొండచుట్టుకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు వినతి పత్రం అందించారు.

### హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



క్రికెట్ విజేతలతో పెద్దకాలువ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు, అధికారులు

**గంగాధర నెల్లూరు:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు హోరా హోరీగా జరిగాయి. సచివాలయ స్థాయి నుండి గెలుపొందిన క్రీడాకారులు క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడలలో మండల స్థాయిలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు పోటీలు హోరాహోరీగా జరగడంతో వీక్షకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ హరిబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకర్, పెద్దకాలువ సర్పంచ్ ఏకాంబరం, ముక్కలత్తూరు ఎంపీటీసీ మగిమై దాస్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు సెల్వ పాండియన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### శ్రీవారి దర్శనానికి 24 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి క్యూ లైన్ ఏటీసీ వద్దకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 80,964 మంది స్వామివారిని దర్శించుకోగా 27,657 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### కర్ణాటక మద్యం స్వాధీనం

**చిత్తూరు రూరల్:** బంగారుపాళ్యం మండలం కొటప్పగారిపల్లెలో మంగళవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేశారు. శిల్ప (32)అనే మహిళ నుంచి 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది సుబ్రమణ్యం గౌడు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నగరి: పొంగళ్లు పెడుతున్న మహిళలు



ఆకట్టుకున్న రంగవల్లిక



# అంబరాన్నంటిన కనుమ సంబరాలు

**నగరి :** నగరి మున్సిపాలిటీ, మండలంలో మంగళవారం పశువుల పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. పశువులను శుభ్రపరచి వాటిని అలంకరించారు. కొత్త గంటలు కట్టి వాటి కొమ్ములకు రంగులు వేశారు. పూలదండలు వేసి హారతులు ఇచ్చి మొక్కుకున్నారు. వీధుల్లో పశువుల వైభవాన్ని తెలిపే ముగ్గులు వేసి పశువుల పట్ల ఉన్న భక్తిని చాటుకున్నారు. కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో కనుమను పురస్కరించుకొని గోపూజ నిర్వహించారు. ఆలయంలో గోవులను పువ్వులతో అలంకరించి పూజలుచేసి పొంగళ్లు పెట్టారు, గోపూజ, నందిపూజ నిర్వహించారు. గోవులకు భక్తులు అరటిపండ్లు, బియ్యం నైవేద్యంగా తినిపించి మొక్కుకున్నారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. యువకులు వీధుల్లో ఉట్టికట్టి వాటిని కొడుతూ సంబరాలు చేసుకున్నారు. అలాగే సోమవారం సంక్రాంతి వేడుకలు మిన్నంటాయి. పట్టణంలోని వీధులు రంగవల్లికలతో ముస్తాబయ్యాయి. పెద్దలు, పిల్లలు కొత్త దుస్తులతో కోలాహలంగా కనిపించారు. మహిళలు కొత్త కుండల్లో పొంగళ్లు పెట్టి సూర్యునికి నైవేద్యం సమర్పించారు. కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లారు.





కీళపట్టు: చంద్రమౌళీశ్వర ఆలయం వద్ద పశువులకు పూజలు

# నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

- రోజా ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో..
- ముఖ్య అతిథిగా విచ్చేయనున్న మంత్రి రోజా



ముగ్గుల పోటీలకు సిద్ధమవుతున్న మైదానం

**నగరి :** రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి, కొండచుట్టు ఉత్సవం సందర్భంగా బుధవారం నియోజవర్గ స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఈ పోటీలు జరగనున్నాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా 40 ఇంచ్‌ల ఎల్‌ఈడీ టీవీ, ద్వితీయ బహుమతిగా 7.5 కేజీల వాషింగ్ మెషీన్, తృతీయ బహుమతిగా టైలరింగ్ మెషీన్, పది మందికి టేబుల్ ఫ్యాన్లు, పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రెషర్ కుక్కర్ బహుమతిగా ఇవ్వనున్నారు. మంత్రి ఆర్కేరోజా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. పోటీలో పాల్గొన దలిచే మహిళలు వారి పేరు, ఊరు, వాట్సప్ వివరాలను నగరి మున్సిపాలిటీ, నగరి మండలానికి చెందిన వారైతే 9642388889 నంబర్‌ను, విజయపురం నింద్ర మండలాలకు చెందిన వారైతే 9100703665 నంబర్‌ను, వడమాపేట, పుత్తూరు మండలాలకు చెందినవారైతే 80199 99969 నంబర్‌ను సంప్రదించాని నిర్వాహకులు తెలిపారు.

## చర్చి నిర్మాణానికి భూమి పూజ



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

**పాలసముద్రం:** క్రైస్తవులంతా ఏసుక్రీస్తును తమ కుటుంబాలలోకి ఆహ్వానించాలని వెంగళరాజుకుప్పం పాల్ వెంకటేష్ తెలిపారు. మంగళవారం వెంగళరాజు కుప్పంలో నూతన చర్చి నిర్మాణానికి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రైస్తవులతో కలసి ప్రత్యేక ప్రార్థన చేసి చర్చి నిర్మాణాన్ని ప్రారాంభించారు.

## నేటి నగరి కొండచుట్టుకు ఏర్పాట్లు పూర్తి

**నారాయణవనం:** మండలంలో టీటీడీ అనుబంధ శైవ క్షేత్రాల ఉత్సవమూర్తులు నగరిలో బుధవారం నిర్వహించే కొండచుట్టు ఉత్సవంలో పాల్గొనే కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ఆలయాల అధికారి నాగ రాజు తెలిపారు. సంక్రాంతి మూడో రోజున పరిసర గ్రామాలల శైవక్షేత్రాల ఉత్సవమూర్తులు నగరిలో నిర్వహించే గిరిప్రదక్షణ ఉత్సవంలో పాల్గొంటారు. నారాయణవనంలోని టీటీడీ అనుబంధ ఆలయాల పరాశరేశ్వరస్వామి, అగస్తీశ్వరస్వామితో పాటు తుంబూ రు తుంబీశ్వరస్వామి, పాలమంగళం పాలీశ్వరస్వామి ఎలకాటూరు, ఆరూరు, బుగ్గ అగ్రహారాల మీదుగా ఊరేగింపుగా వెళ్లి నగరిలో గిరి ప్రదక్షిణ ఉత్సవంలో వేంచేపు చేస్తారు. బుధవారం సముదాయంలోని మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి, నారాయణవనంలోని చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా నగరికి వేంచేపు చేయనున్నట్లు నాగరాజు తెలిపారు. ఉదయం 8 గంటలకు సముదాయంలోని ఆరుణానదిలో జరిగే ఉత్సవ మూర్తుల సంధింపు కార్యక్రమానికి భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

## వార్డు సభ్యుడు మృతి

**నారాయణవనం:** వైఎస్సార్ సీపీ నాయకుడు, నారాయణవనం పంచా యతీ 15వ వార్డు సభ్యుడు, ఆటో వర్కర్స్ యూ నియన్ గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యంశెట్టి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల జెడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడి, వైసీపీ మండల కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ బాబు, సర్పంచ్ శారదాగణేషన్, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, ఆటో కార్మికులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# కిక్కిరిసిన ఆరిమాని గంగమ్మ ఆలయం

**శ్రీరంగరాజపురం:** తయ్యూరు పాయికట్టులో వెలసిన ఆరిమాని గంగమ్మ ఆలయానికి భక్తులు మంగళవారం పోటెత్తారు. కనుమ పండుగను పురస్కరించుకుని జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భకక్తులు తరలివచ్చారు. ఆలయ అధికారులు, ధర్మకర్త లింగారెడ్డి పకడ్బందీగా సౌకర్యాలు కల్పించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్, చిత్తూరు నియోజకవర్గం వైఎస్‌ఆర్ సీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సీఐ సత్యబాబు, ఎస్ఐ షేక్షావలి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి సేవలో చిత్తూరు వైఎస్‌ఆర్ సీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి

## 108లో ప్రసవం



కుటుంబ సభ్యులకు బిడ్డను అప్పగిస్తున్న ఈఎంటీ నాగరాజు

**కేవీబీపురం:** మండలంలోని ఆదవరం గిరిజన కాలనీకి చెందిన సునీత(19) సోమవారం 108 వాహనంలో బిడ్డను ప్రసవించింది. వేకువజామున ఆమెకు పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబసభ్యులు 108కి సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న 108 సిబ్బంది గర్భిణిని శ్రీకాళహస్తి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. మార్గమధ్యమంలో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. తప్పని పరిస్థితుల్లో పైలెట్ నాగయ్య వాహనాన్ని రోడ్డు పక్కగా ఆపి ఆశా సుబ్బరత్నం సహాయంతో చికిత్స అందించారు. ఆ మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను శ్రీకాళహస్తికి తరలించి వైద్యం అందిస్తున్నారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. ఈఎంటీ నాగరాజు, ఆశా సుబ్బరత్నం సేవలను పలువురు అభినందించారు.

## భక్తి విరిసింది.. కైలాసగిరి మురిసింది

కైలాసగిరి పర్వతశ్రేణులు శివ నామస్మరణతో పులకించాయి. శ్రీకాళహస్తి క్షేత్రంలో మంగళవారం కైలాసగిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా జరిగింది. అశేషంగా భక్తులు తరలివచ్చారు. శ్రీస్వామి, అమ్మవార్ల వెంట దాదాపు 21 కిలోమీటర్లు ఉన్న కైలాసగిరిని ఓం నమశ్శివాయ అంటూ స్మరిస్తూ పారవశ్యంలో మునిగితేలారు. ఉదయం ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లు విశేష పూజలు అందుకుని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కళా ప్రదర్శనల నడుమ గిరిప్రదక్షిణకు బయలుదేరారు. అప్పటికే ఆలయం వద్దకు చేరుకున్న అశేష భక్తులు స్వామి, అమ్మవార్ల వెంట అడుగులు వేశారు. సాయంత్రం శుక్రబ్రహ్మశ్రం వద్దకు భక్తులు తండోపతండాలుగా వెళ్లి ఎదురుసేవలో స్వామి, అమ్మవార్లను దర్శించి పులకించారు. గిరి ప్రదక్షిణ అనంతరం ఆలయం వద్దకు ఉత్సవమూర్తులు చేరుకోగానే ఒక్కసారిగా హరహర మహాదేవా అంటూ శివ నామస్మరణ హోరెత్తింది. ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. గిరి ప్రదక్షిణకు దేవస్థానం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మార్గమధ్యమంలో అన్నదానాలు చేశారు. – శ్రీకాళహస్తి









# మణికంఠ జ్యోతి.. స్వామి అయ్యప్ప జ్యోతి



నగరి బైపాస్ సర్కిల్ వద్ద అయ్యప్ప ఆలయంలో జ్యోతి పూజలు



కరకంఠేశ్వర స్వామి ఆలయంలో పుష్పాలంకరణ

**నగరి :** పట్టణ పరిధి బైపాస్ సర్కిల్ వద్ద వెలసి ఉన్న శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో, కరకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాకారంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో, సత్రవాడ అయ్యప్ప స్వామి ఆలయంలో. చంద్రమౌళీశ్వర ఆలయంలో సోమవారం మకర జ్యోతి పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. అయ్యప్పస్వామి, విఘ్నేశ్వర, సుబ్రమణ్య స్వామి విగ్రహాలను, పదినెనిమిది మెట్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అఖండ దీపం వెలిగించి పూజలు చేశారు. అఖండ దీపంతో ఆలయ ప్రాకారాలను చుట్టి రావడం ప్రత్యేకతను సంతరించుకుంది. అన్నదానం చేశారు. శబరి కొండపై మకర జ్యోతి వెలిగించే సమయంలో ఆలయాల్లో అఖండ జ్యోతి వెలిగించగా శరణుగోష మిన్నంటింది.

# నేత్రపర్వం.. గోదా పరిణయోత్సవం



సంక్రాంతి ఉత్సవంలో స్వామి,అమ్మవార్లు



ఊరేగింపులో గోదాదేవితో, వేంకటేశ్వరస్వామి

**నారాయణవనం:** టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గోదాదేవికి, కల్యాణ వెంకన్నకు వైఖానస ఆగమోక్తంగా మాలమార్పిడి కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయన్ని తెరచిన అర్చకులు నిత్యపూజాకైంకర్యాలను పూర్తి చేసి తొలి గంటతో నైవేద్య సమర్పణ చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం గోదాదేవిని పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించారు. అనంతరం తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధిలో ఊరేగింపుగా సన్నిధి వీధిలోని పదహారు కాళ్ల మండపం చేరుకున్న అమ్మవారికి, తిరుచ్చిపై కల్యాణ వేంకటేశ్వస్వామి ఎదురేగారు. మేళతాళాలు, వేద ఘోష మధ్య అర్చకులు గోదాదేవికి, కల్యాణ వెంకన్నకు మూడు మార్లు మాల మార్చిడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న గోదాదేవి సమేత కల్యాణ వెంకన్నకు ఆస్థానం నిర్వహించారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంతసేవతో భోగ శ్రీనివాసుని పవలింపు సేవను నిర్వహించారు. అలాగే సోమవారం ఆలయంలో సంక్రాంతి ఉత్సవాన్ని నిర్వహించారు. మరక సంక్రమణ గడియల్లో ఉత్సవమూర్తులకు ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవీ,భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులను అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తులకు సంక్రాంతి ఆస్థానం నిర్వహించి దీప, ధూప నైవేద్యాలను సమర్పించారు. ఏఈవో పార్థ సారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు.

# ఘనంగా వేణుగోపాల స్వామి ఊరేగింపు



రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి పుర విహారం

**కార్వేటినగరం:** ప్రసిద్ధ సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కనుమ పండుగను పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి మూలవిరాట్‌ను పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు స్వామి వారిని ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారుతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 8 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు నారాయణదాసరి, గోపాల ఆచారి, భక్తులు పాల్గొన్నారు.

# బాలగురునాథీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజాసామగ్రి, పాల బిందెలు తీసుకువస్తున్న భక్తులు



విశేష అలంకరణలో బాల గురునాథీశ్వరస్వామి



ఆలయ ఆవరణలో పొంగళ్లు పెడుతున్న భక్తులు

**పాలసముద్రం:** మండలంలోని రాచపాళెం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామివారికి సంక్రాంతి పండుగ సందర్భంగా సోమ, మంగళవారం వివిధ అభిషేకాలు చేపట్టారు. అన్నదానం నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి వచ్చిన మహిళలు స్వామివారి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టారు. మధ్యాహ్నం పాలబిందెలతో పంబ వా యిద్యాలతో నృత్యాలు చేస్తూ స్వామివారికి వివిధ అభిషేకాలు చేశారు. కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామివారిని సుందరంగా అలంక రించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

# శాస్త్రోక్తంగా సూర్యనారాయణ హోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

**వరదయ్యపాళెం:** మండలంలోని అమ్మాభగవాన్‌లకు చెందిన ఏకం ఆలయం ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం వరదయ్యపాళెం గోవర్ధనపురంలో లోకా ఫౌండేషన్ కార్యాల య ప్రాంగణంలో సూర్యనారాయణ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బీఎన్‌కండ్రిగ, తడ, సూళ్లూరుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తిరుపతికి చెందిన రుత్విక్కుల ఆధ్వర్యంలో గణపతి పూజ, విష్వక్సేన, నవగ్రహ పూజ, సూర్యనారాయణ హోమం నిర్వహించారు. తీర్థప్రసాదాలతో పాటు అయోధ్య శ్రీరాముని అక్షింతలు భక్తులందరికీ అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లోకా ఫౌండేషన్ ప్రతినిధులు ఆచార్య ఆనందగిరిజీ, లోకేష్, సునీల్, లక్ష్మీ దాసాజీ, బొప్పన రమేష్‌బాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, బొప్పన తిలక్‌బాబు, వెంకటేశ్వర్లు, చిన్నా, సుబ్రమణ్యం రెడ్డి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.